ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL


https://epaper.eyyaltynews.com/

బుధవారం 19, జూలై 2023


## భారీ వర్షాలు కురిసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి : కేటీఆర్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 19:** భారీ వర్షాలు కురిసినా పరిస్థితిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో నానక్‌రామ్‌గూడలోని కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో వరదలు, పారిశుధ్యంపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. భారీ వర్షం వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అన్నిశాఖల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వర్షాల కారణంగా ప్రాణనష్టం జరగకూడదన్న లక్ష్యంతో అధికారులు పనిచేయాలని ఆదేశించారు.



కాంగ్రెస్ నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ : తలసాని

2



మా కార్యాచరణ చెబితే కేసీఆర్ ప్రగతి భవన్ ఖాళీ చేస్తారు..

- కోమటిరెడ్డి వెంకటరెడ్డి

2



మళ్లీ యమునమ్మ ఉగ్రరూపం.. ప్రమాదకర స్థాయి దాటి పోయింది...?

2



### అప్రమత్తంగా ఉన్నాం.. ఆందోళన వద్దు

**- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**



మరో మూడు రోజుల పాటు భారీ వర్షాల నేపథ్యంలో నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల్లో నష్టం కలగకుండా పాటించవల్సిన చర్యలపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ఎలాంటి పరిస్థితులు ఎదురైన ఎదర్కొవడానికి సిద్దంగా ఉన్నామని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే తెలిపారు. వాతావరణ సమాచారంతో పాటు పరిస్థితులను అనుక్షణం అధికారులతో సమీక్షిస్తున్నామని చెప్పారు.

# వదలని ముసురు.. అంబర్‌పేటకు తప్పని పాట్లు..?

### అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంది

**- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ..**

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 19:** గత మూడు రోజుల నుంచి పడుతున్న ముసురుతో అంబర్ పేట నియోజకవర్గం తడిసి ముద్దయ్యింది. గత సోమవారం రాత్రి జల్లులతో మొదలైన వర్షం.. ఇయ్యాల బుధవారం వరకు పడుతూనే ఉంది. ఉదయం వేళ పడుతున్న వర్షం కారణంగా కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అంబర్ పేట ఫ్లైవోవర్ నిర్మాణంలో భాగంగా అంబర్ పేట ప్రధాన రహదారిలో రోడ్లన్ని బురద మయం కావడంతో వాహనాల వేగం నెమ్మదించింది. ఇప్పటి వరకు హైదరాబాద్ వ్యాప్తంగా గరిష్ఠంగా 20.0 మి.మీ.వర్షం గోల్కొండ, మియాపూర్‌లలో పడింది. అంబర్ పేటలో 3 మి.మీ వర్షం పడింది. అంబర్ పేటలోని పలు చోట్ల విద్యుత్ సరఫరాకు స్వల్ప అంతరాయం ఏర్పడుతోంది. కాగా. నిన్నటి వరకు పౌరుల నుంచి 22 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించామని ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్) డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. కాగా గ్రేటర్ పౌరులు వర్షాల నేపథ్యంలో సహాయం కోసం జీహెచ్‌ఎంసీ కాల్ సెంటర్ 040-2111 1111 లో సంప్రదించాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు.

కాగా... వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం మరికొన్ని గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారాయి. కోస్తాంధ్ర, రాయలసీమలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు, రేపు తెలంగాణలో పలుచోట్ల



అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత తొలిసారిగా హైదరాబాద్ నగరమంతా ముసురు వాన కురిసింది. పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం, మరికొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కొనసాగాయి. మరో మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించారు.




## దున్నపోతు ఈనిందంటే... జున్ను పంపిమ్మన్నడంట..?

### తెలంగాణ ఎలక్షన్స్ డిసెంబర్ 7న అంటూ బిగ్ బ్రేకింగ్ ఫేక్ న్యూస్

### గత ఎలక్షన్ల టీ న్యూస్ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూలై 19:** తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రిలీజైయిందంటూ ఓ అపరిచిత వ్యక్తి పోస్ట్ చేసిన క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో నవంబర్ 12న తెలంగాణలో అసెంబ్లీ లక్షల నోటిఫికేషన్, ఒకే విడతలో ఎన్నికలు జరిగేందుకు సన్నాహాలు, డిసెంబర్ 7న ఎన్నికలు, అదే నెల 11న ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారని గత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ సందర్భంగా టీ న్యూస్‌లో ప్రసారమైన క్లిప్పింగ్ ను పోస్ట్ చేశారు. దీంతో ఎలక్షన్లు వచ్చేశాయ్ అంటూ ఎగిరి గంతేస్తూ కొందర అంబర్ పేట నియోజకవర్గంతో పాటు నగర వ్యాప్తంగా పోటా పోటీగా క్లిప్‌ను షేర్ చేసుకుంటున్నారు.

అయితే మామూలే కానీ సోషల్ మీడియాలో ఏదైనా పోస్టు చేసేముందే ఆలోచించండి. కంటెంట్ ఎలాంటిదో గమనించండి. అది మీ వ్యక్తిగత సమాచారమైనా, తప్పుడు సమాచారమైనా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

మనం చూసిన ప్రతీది అప్‌డేట్ చెయ్యడం వల్ల మీరు నష్టపోయే అవకాశం ఉంది. మీకు తెలియని కంటెంట్‌ను ఫార్వర్డ్ చేయొద్దు. షేర్ చేయాలనుకుంటే అది నిజమో కాదో..

www.factly.com, www.boomlive.inలో చెక్ చేయండి.




## ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు శుభవార్త..

### ఇకపై వైద్య సేవల పరిమితి పెంపు..

### త్వరలోనే డిజిటల్ కార్డులు..

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 19:** అర్హులైన పేదలకు మంచి వైద్యం అందించాలనే కాన్సెప్ట్‌తో వచ్చిన ఆరోగ్య శ్రీ సేవలు ఎంతో మంది పేదలకు మంచి వైద్యంతో పాటు వారి కుటుంబాలలో ఆనందాన్ని నింపాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరవాత వైద్యంపై మరింత దృష్టి పెట్టిన కేసీఆర్ సర్కార్ ఎప్పటికప్పుడు పేదవాడికి అవసరం అయ్యే నిర్ణయాలు తీసుకుంటుంది. ఇందులో భాగంగానే ఇప్పుడు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా లబ్ధిపొందే వారి కోసం వైద్య సేవల పరిమితిని 2 లక్షల నుండి 5లక్షలకు పెంచింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను కూడా మొదలు పెట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు. ఈ ఆరోగ్య శ్రీ సేవల కోసం కొత్తగా డిజిటల్ కార్డ్ లని ఇవ్వనుంది హెల్త్ డిపార్ట్మెంట్. దీనికోసం ఈ కేవైసీ నీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచన చేశారు మంత్రి. ఆరోగ్య శ్రీ సేవల లో బయోమెట్రిక్ విధానం లో కొంత ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఫేస్ రికాగ్నైజేషన్ విధానం తీసుకురావాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది.

## హ్యూమన్ రైట్స్ కమిషన్ డీఎస్పీగా ఆకుల శ్రీనివాస్..



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 19: ఈస్ట్ జోన్ కాచిగూడ డివిజన్ ఏసీపీగా విధులు నిర్వహించిన ఆకుల శ్రీనివాస్ పదోన్నతిపై తెలంగాణ హ్యూమన్ రైట్స్ కమిషన్ డీఎస్పీగా ఇయ్యాల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

## హుస్సేన్ సాగర్ నీటిపై నడవాలి ఉందా... అయితే త్వరలోనే...?

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 19: హైదరాబాద్‌లో ప్రముఖ పర్యాటక కేంద్రం హుస్సేన్ సాగర్. సిటి టూరిస్టులు తమ విజిటింగ్ ప్లేసెస్ లిస్ట్ లో ఈ భారీ సరస్సును తప్పనిసరిగా చెర్చుకుంటారు. దీంతో సాగర్ అందాలను మరింత పెంచేందుకు ప్రభుత్వం శ్రద్ధ పెట్టింది. హైదరాబాద్ హుస్సేన్ సాగర్ చుట్టూ టూరిస్ట్ సర్క్యూట్ గా చేయడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది హెచ్‌ఎండిఏ. ఇప్పటికే హుస్సేన్ సాగర్ చుట్టు ఆకట్టుకునే నిర్మాణాలు, పార్కులతో జనసందడి నెలకొంటుంది. దీనికి మరో అద్భుత ఆకాశ మార్గం సిద్ధం అవుతోంది. సాగర్ జలాల్లో తేలియాడే వంతెన నిర్మాణం చేపట్టారు. లెక్ డక్ పార్కు డెవలప్ మెంట్ లో భాగంగా ఈ భారీ వంతెన హుస్సేన్ సాగర్ నీటిలో తేలియాడుతోంది. నగరం నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్ హైదరాబాద్ ఐకానిక్ అని చెప్పాలి. ఇక దాని చుట్టూ అంతా పర్యాటక ప్రసిద్ధి చెందిన ప్రాంతమే. అందుకే ప్రభుత్వం ఇటీవల ట్యాంక్ బండ్ తో పాటు పరిసరాలను 40 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసింది.



రీసెంట్‌గా ఎన్టీఆర్ మార్గ్‌లో ఫార్ములా-ఈ కార్ రేసింగ్ సందర్భంగా సాగర్ లో నీటిలో తేలియాడే మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేసారు. 90 మీటర్ల ఎత్తుకు నీరు వెళ్లే ఈ ఫౌంటెన్‌లో 3సెట్ల లేజర్ ఉండి వివిధ థీమ్‌లతో షో ఆకట్టుకుంది. అయితే కొత్త సచివాలయం ఎదురుగా ఉన్న దానిని పీవీ నర్సింహారావు మార్గ్ (నెక్లెస్ రోడ్) వైపు మారుస్తున్నారు. అమరవీరుల స్థూపం, సెక్రటేరియట్, భారీ అంబేద్కర్ విగ్రహంతో సాగర్ అందాలు అలరారుతున్నాయి. వీటికి మరొక స్పెషల్ అట్రాక్షన్ యాడ్ కాబోతుంది. అదే మాస్కోలోని వేలాడే బ్రిడ్జ్ మాదిరి హుస్సేన్ సాగర్ లో తేలియాడే వంతెనను నిర్మించారు.జలవిహార్ పక్కన లెక్ డక్ పార్క్ పేరుతో ఈ పర్యాటక ప్రాంతాన్ని డెవలప్ చేస్తున్నారు. ఇందులోకి వచ్చిన వారు సాగర్ లోని జలలాపైకి వెళ్లి దానిపైన నడిచిన అనుభూతి వచ్చేలా పార్కును సిద్దం చేస్తున్నారు. ఈ తేలియాడే వంతెన కోసం 10కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తోంది హెచ్‌ఎండిఏ. ఇలాంటి పార్కును హైదరాబాద్ లో మొదటి సారి ఎర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కు సంబంధించి వేలాడే వంతెన నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. కాషాయ కలర్‌లోని వంతెన ఎంటా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.



## మీ ఎమ్మెల్యే బాగా పనిచేస్తున్నాడా..

### మీకు అందుబాటులో ఉంటున్నారా..

### నగరంలో సర్వేల జోరు.. ఈ సారి సొంత సర్వేల్లో నేతలు..

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 19:** మీ ఎమ్మెల్యే బాగా పనిచేస్తున్నాడా.. మీకు అందుబాటులో ఉంటున్నారా.. మీరు ఎ పార్టీకి ఓటు వేయాలనుకుంటున్నారు. ఇలాంటి ప్రశ్నలడిగేవాళ్లు ఇప్పుడు హైదరాబాద్ లోని ప్రతి గల్లీలో కనిపిస్తున్నారు. దీంతో సర్వే సంస్థలకు చేతినిండా పనిదొరికింది. మామూలుగా గ్రామీణ ప్రాంతాలు, సెమి అర్బన్, అర్బన్ ఎరియాల్లో కొంత జనం నాడి తెలిసిపోతుంది. బహిరంగంగా కూడా ప్రజలు మాట్లాడుకుంటారు. మెట్రో సిటిలో మాత్రం అంత ఈజీగా టాక్ బయటకు రాదు. అసలే ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. దీంతో గ్రేటర్ ఎమ్మెల్యేలలో టెన్షన్ మెదలైంది. అసలు మా పనితనంపై ప్రజలు ఎమనుకుంటున్నారనే బెంగ పట్టుకుంది. అధినేత కేసీఅర్ గుట్టుగా సర్వేలు చేయిస్తున్నా అవి వారికి మాత్రం అందజేయడంలేదు. దీంతో కొందరు ఎమ్మెల్యేలు సొంత సర్వేలు చేయించుకుంటున్నారని తెలుస్తోంది. గత పది రోజులుగా ఢిల్లీ, బెంగుళూరు నుంచి వచ్చిన సర్వే ఎజెంట్లు హైదరాబాద్‌లో పెద్దఎత్తున పనిచేస్తున్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు ఒక అడుగు ముందుకేసి పార్టీల పరంగా, ప్రత్యర్థుల జనాదరన మీద కూడా సర్వేలు చేయిస్తున్నారు. అధికార పార్టిలో గ్రాఫ్ పడిపోతే.. ప్రతిపక్షపార్టిలో పోటిచేసి గెలుపోందే అవకాశం ఉందా? అని కూడా చెక్ చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇక కొన్ని సర్వే సంస్థలు కేవలం టెలి కాలింగ్ ద్వారా కూడా సర్వే నిర్వహిస్తుంది. అంతే కాకుండా కులాల వారిగా, మతాల వారిగా, బస్తీలు, అపార్ట్‌మెంట్లు ఇలా సెంగ్నెంట్ల ప్రకారం సర్వేలు చేయిస్తున్నారు. ఏ వర్గం తమ పట్ల వ్యతిరేఖంగా ఉంది. ఎవరికి అనుకూలంగా ఉన్నారనే విషయం తెలుసుకుంటున్నారు.

ఈ సర్వేల కోసం గ్రేటర్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు ఒకటి నుంచి రెండు కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

## ఇకపై వెబ్ సిరీస్‌లకు కేంద్రం అవార్డులు..

### కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రకటన



**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 19:** ఇకపై కేంద్ర ప్రభుత్వం ఉత్తమ వెబ్ సిరీస్‌లకు అవార్డులను ప్రకటించనుంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ స్వయంగా తెలిపారు. ట్విట్టర్ వేదికగా ఈ విషయమై ఆయన పోస్ట్ చేశారు. గోవాలో జరిగే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో 'బెస్ట్ వెబ్ సిరీస్' క్యాటగిరీలో ఈ అవార్డును అందించనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. భారత దేశంలో చిత్రీకరించి, భారతీయ భాషల్లో అందుబాటులో ఉన్న వెబ్ సిరీస్‌ల్లో బెస్ట్ సిరీస్‌కు అవార్డు అందించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.టెక్నికల్‌తో పాటు ఇతర విభాగాల్లో ఉత్తమంగా నిలిచినవి బరిలో నిలుస్తాన్నాయన్న మంత్రి.. ఓటీటీలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి, భారతీయ భాషల్లో కంటెంట్‌ను తీసుకురావడం, భారతీయుల ట్యాలెంట్‌ను గుర్తించడమే ఈ అవార్డుల ప్రధానోత్సవ ముఖ్య లక్ష్యమని కేంద్ర మంత్రి వివరించారు. 54వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో ఈ ఏడాది నుంచి ఈ అవార్డును ఏటా ప్రధానం చేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. భారత దేశం అసాధారణ ప్రతిభతో నిండి ఉందన్న మంత్రి, ప్రపంచానికి చెప్పాల్సిన ఎన్నో కథలను చూపించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందంటూ ట్వీట్ చేశారు.



## రేపు INDIA కూటమి తొలి భేటీ...

ఇయ్యాల్టి న్యూస్, బెంగుళూరు , జూలై 19: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించేందుకు ప్రతిపక్ష కూటమి భారత తొలి సమావేశం రేపు గురువారం జరగనుంది. రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న మల్లికార్జున్ ఖర్గే ఛాంబర్‌లో ఈ సమావేశం జరగనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వర్షాకాల సమావేశాల నేపథ్యంలో మొదటి రోజు నుండి పార్లమెంట్‌లో చేపట్టాల్సిన అంశాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రతిపక్ష నేత ఒకరు తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20వ తేదీన ప్రారంభమై ఆగస్ట్11న ముగుస్తాయి.ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పార్లమెంటులో లేవనెత్తాల్సిన అంశాలపై సమన్వయంతో వ్యవహరించాలని బెంగళూరులో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి.

26 పార్టీల INDIA కూటమికి లోక్ సభలో 150 మంది ఎంపీల మద్దతు ఉండగా, ఎన్డీయేకు 330 మంది ఎంపీల మద్దతు ఉంది.

# మళ్లీ యమునమ్మ ఉగ్రరూపం..

# ప్రమాదకర స్థాయి దాటి పోయింది...?

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 19:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చాల చోట్ల లోతట్టు ప్రాంతాలన్ని జలమయమవుతున్నాయి. ఇక ఢిల్లీలో యమనా నది తన ఉగ్రరూపాన్ని మళ్లీ తీవ్రతరం చేస్తోంది. గత కొన్నిరోజుల పాటు ఈ యుమనా నది ప్రవాహం తగ్గింది. కానీ ఢిల్లీలో మళ్లీ ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని. బుధవారం ఉదయం నాటికి యమునా నది నీటిమట్టం మళ్లీ ప్రమాదకర స్థాయిని దాటేసింది. దీంతో ఢిల్లీ వాసులు ఆందోళ చెందుతున్నారు. భారీ వర్షాలు కురవడం వల్లే మళ్లీ యమునా నది ఉప్పొంగుతోందని అధికారులు చెబుతున్నారు.ఇక వివరాల్లోకి వెళ్తే యమునా నది నీటిమట్టంపై కేంద్ర జల కమిషన్ కీలక సమాచారాన్ని విడుదల చేసింది. బుధవారం ఉదయం 8 గంటల సమయానికి ఢిల్లీలోని పాత రైల్వే వంతెన వద్ద యమునా నది నీటిమట్టం 205.33 మీటర్లు దాటిపోయిందని చెప్పింది.

ఈ ప్రమాదకర స్థాయిని దాటి ప్రస్తుతం 205.48 మీటర్లుగా నమోదైనట్లు పేర్కొంది. ఇంకో విషయం ఏంటంటే బుధవారం సాయంత్రం నాటికి 205.72 మీటర్లకు చేరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా కొన్ని రోజుల క్రితం యమునా నది నీటి మట్టం స్థాయి ఆల్ టైం రికార్డుకు చేరిన సంగతి తెలిసిందే. ప్రమాదకర స్థాయిని దాటి ఏకంగా 208.66 మీటర్లు నమోదైంది.

దీంతో అనేక ప్రాంతాల్లో వరదలు సంభవించడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఇప్పుడు



మళ్లీ యమునా నది ప్రమాదకర పరిస్థితిని దాటడంతో మళ్లీ వరదలు సంభవిస్తాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.



## అంతా దేవుడి దయ..

### ఎమర్జన్సీ ల్యాండింగ్‌పై రాహుల్ గాంధీ ట్వీట్

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 19:** వాతావరణం అనుకూలించకపోవడంతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న విమానం అత్యవసరంగా భోపాల్ విమానాశ్రయంలో ల్యాండైన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన 24 గంటల తరువాత రాహుల్ గాంధీ.. తన తల్లిని ప్రశంసిస్తూ ఓ ఫోటోను షేర్ చేశారు. రాహుల్ గాంధీ ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫోటోలో సోనియా గాంధీ ఆక్సిజన్ మాస్క్ ధరించి విమానంలో కూర్చున్నట్లు కనిపిస్తోంది. "ఎంత ఒత్తిడిలో ఉన్న మా అమ్మ దయకు ప్రతిరూపంగానే ఉంటుంది.." అని రాహుల్ గాంధీ క్యాప్షన్ జోడించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ ఇద్దరూ మంగళవారం బెంగళూరులో జరిగిన ప్రతిపక్షాల కూటమి సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సమావేశం ముగిసిన వెంటనే ప్రత్యేక ఛార్టర్డ్ ఫ్లైట్‌లో బెంగళూరు నుంచి ఢిల్లీకి బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో వాతావరణం అనుకూలించకపోవడంతో ఫైలెట్ల అత్యవసరంగా విమానాన్ని భోపాల్ విమానాశ్రయానికి మళ్లించారు. అనంతరం విమానం సురక్షితంగా ల్యాండ్ అవడంతో కాంగ్రెస్ శ్రేణులు ఊపిరిపీల్చుకున్నారు.

## విపక్ష కూటమిలో

## అప్పుడే లుకలుకలు..

### బెంగళూరులో నితీశ్‌ను అవమానిస్తూ పోస్టర్లు..

**ఇయ్యాల్టి న్యూస్, బెంగుళూరు, జూలై 19:** భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా 26 పార్టీలతో మెగా కూటమి ఏర్పడింది. బెంగళూరు వేదికగా సమావేశమైన విపక్షాలు.. ఆ కూటమికి ఇండియా (INDIA) అని పేరు పెట్టాయి. ఎన్నో అంచనాల నడుమ, ఎన్నోవ్యవప్రయాల అనంతరం ఏర్పడిన ఈ కూటమిలో అప్పుడే లుకలుకలు మొదలైనట్లు కనిపిస్తోంది. బెంగళూరులో చర్చల అనంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో నితీశ్ కుమార్ పాల్గొనకుండానే పాట్నాకు వచ్చేశారు. దీంతో విపక్ష పార్టీల చర్చల్లో నితీశ్ కలత చెందారనే పుకార్లు జోరందుకున్నాయి.




వాస్తవానికి విపక్షాల ఐక్యం కోసం ముందు నుంచి నితీశ్ కుమార్ చాలా ప్రయత్నాలు చేశారు. అలాంటి నితీశ్ కుమారే సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొనకపోవడం వల్ల సహజంగానే అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. వాస్తవానికి కూటమి పేరు ఇండియా అని పెట్టడం ఆయనకు నచ్చలేదని తెలుస్తోంది. వాస్తవానికి ఈ కూటమికి పేట్రియాట్రిక్ డెమొక్రటిక్ అలయన్స్ (పీడీఏ) అని పెడతారని పాట్నా సమావేశాల అనంతరం ప్రచారం జరిగింది. కానీ రెండవసారి బెంగళూరులో జరిగిన సమావేశాల్లో ఇండియా అని పేరు మార్చారు.

## మా కార్యాచరణ చెబితే కేసీఆర్ ప్రగతి భవన్ ఖాళీ చేస్తారు

### - కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 19:** కాంగ్రెస్ పార్టీ కార్యాచరణను ఇప్పుడే పూర్తిగా చెబితే ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగు నెలల తర్వాత ఖాళీ చేసే ప్రగతి భవన్‌ను ఈ రోజే ఖాళీ చేస్తారని ఆ పార్టీ నేత, భువనగిరి లోక్ సభ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సమావేశానికి మాణిక్ రావు ఠాక్రే, రేవంత్ రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క, జూపల్లి కృష్ణారావు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విడతల వారీగా బస్సు యాత్ర చేయాలని, జిల్లాల వారీగా బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నేతలమంతా ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఏ నిర్ణయమైనా ఇక పీఏసీలో చర్చించాలన్నారు. విడతల వారీగా బస్సు యాత్రను చేపడతామన్నారు. జిల్లాల్లో భారీ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. తమ నేతలలో చిన్న చిన్న విభేదాలు ఉన్నప్పటికీ వాటిని పక్కన పెట్టి ముందుకు సాగుతామన్నారు. ఈ నెల 23న పొలిటికల్ అఫైర్స్ కమిటీ భేటీ జరగనుందన్నారు. ఈ నెల 30న ప్రియాంక సభలో మహిళా డిక్లరేషన్ ఉండనుందని తెలిపారు.కాంగ్రెస్ నేతలమంతా స్ట్రాటెజీ రోడ్డు మ్యాప్ తో ముందుకు వెళ్లాల్సిన అవసరముందన్నారు. వచ్చే పీఏసీ సమావేశంలో బస్సుయాత్రపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అభిప్రాయభేదాలు ఉంటే మరిచిపోతామన్నారు. సీఎం కేసీఆర్ ఓట్ల కోసమే దళిత బంధు పథకాన్ని తీసుకు వచ్చారన్నారు. తాను లాగ్ బుక్ ను బయటపెట్టాక గానీ పలు ప్రాంతాల్లో 24 గంటల విద్యుత్ ఇవ్వడం లేదన్నారు.



### ప్రపంచంలోనే అతి పెద్ద కార్యాలయంపై

## ప్రధాని మోదీ ఏం చెప్పారంటే..?

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 19:** పెంటగాన్‌ను అధిగమించి గుజరాత్‌లోని సూరత్‌లో స్థాపితం అవుతోన్న భవనం.. ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయ స్థలంగా మారనుందన్న



వార్తలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఇది సూరత్ వజ్రాల పరిశ్రమ డైనమిసాన్ని, వృద్ధిని చూపుతుందని చెప్పారు. భారతదేశ వ్యవస్థాపక స్ఫూర్తికి ఇది నిదర్శనమని ప్రధాని మోదీ ట్వీట్‌లో పేర్కొన్నారు. వజ్రాల వ్యాపార కేంద్రం అయిన సూరత్ డైమండ్ బోర్స్ అని పిలువబడే ఈ భవనం.. కట్టర్లు, పాలిషర్లు, వ్యాపారులతో సహా 65వేల మంది వజ్రాల నిపుణుల కోసం "వన్-స్టాప్ డెస్టినేషన్" అవుతుందని ఈ సందర్భంగా చెప్పారు. ఈ భవనాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు."సూరత్ డైమండ్ బోర్స్ వజ్రాల పరిశ్రమ వృద్ధిని ప్రదర్శిస్తుంది. ఇది భారతదేశ వ్యవస్థాపక స్ఫూర్తికి కూడా నిదర్శనం. ఇది వాణిజ్యం, ఆవిష్కరణలు, సహకారానికి కేంద్రంగా ఉపయోగపడుతుంది. అంతే కాకుండా ఇది మన ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది, ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది" అని ప్రధాన మంత్రి ట్వీట్‌లో రాసుకువచ్చారు.15-అంతస్తుల ఈ భవనం 35 ఎకరాల స్థలంలో విస్తరించి.. తొమ్మిది దీర్ఘచతురస్రాకార నిర్మాణాలను కలిగి ఉంది. విశాలమైన ఈ కాంప్లెక్స్‌ను నిర్మించిన కంపెనీ ప్రకారం, ఇది 7.1 మిలియన్ చదరపు అడుగుల అంతస్తు స్థలాన్ని కలిగి ఉంది. ఈ భవన నిర్మాణం పూర్తి కావడానికి నాలుగేళ్లు పట్టింది. అయితే ఈ కాంప్లెక్స్‌లో 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రిక్రియేషనల్ జోన్, పార్కింగ్ ప్రాంతం కూడా ఉంది. కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 8 కింద ఈ భవనం రిజిస్టర్ చేయబడింది. ప్రపంచంలోని 90 శాతం వజ్రాలు కత్తిరించబడే సూరత్‌ను ప్రపంచ రత్నాల రాజధానిగా పిలుస్తారు.

## కాంగ్రెస్ నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్ : తలసాని

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 19:** బీసీ కులాలను కించపరుస్తూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను చులకన చేస్తే ఊరుకోబోమని అన్నారు. బీసీ నేతలపై వ్యక్తిగత దాడులు చేయడం సరికాదని చెప్పారు. బీసీ నేతలపై బాడీ షేమింగ్ కు కూడా పాల్పడుతున్నారని విమర్శించారు. తాము తెగిస్తే దేనికీ భయపడమని అన్నారు. రాబోయే రోజుల్లో తామంటే ఏమిటో చూపిస్తామని తెలిపారు. పద్ధతిగా ఉండాలనే తాము ఇన్నాళ్లు మౌనంగా ఉన్నామని చెప్పారు. అన్ని బీసీ కులాలని పిలిపించి మాట్లాడుతామని తెలిపారు.

బీసీ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే లబ్ధి కలుగుతుందని మీరు భావిస్తే అది మీ ఖర్మ అని తలసాని చెప్పారు. బీసీల సమస్యలన్నీ తమకు తెలుసని అన్నారు. త్వరలోనే హైదరాబాద్ లో బీసీలతో భారీ బహిరంగసభను నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు కళ్లు తెరవాలని... లేకపోతే ఆ పార్టీ భూస్థాపితం అవుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలందరినీ ఏకం చేసి కాంగ్రెస్ అంతు చూస్తామని హెచ్చరించారు.

## ఈటలతో భేటీ...

### పార్టీ మార్పుపై రాజాసింగ్ ఏం చెప్పారంటే..!


**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 19:** గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు, కార్పోరేటర్‌పై అధికార బీఆర్ఎస్ తప్పుడు కేసులు బనాయించిందని, ఈ విషయాన్ని తాము తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకు వెళ్లామని ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పారు. పోలీసులు దౌర్జన్యం చేస్తుండటంతో బీజేపీ కార్యకర్తలకు అండగా నిలబడేందుకు ఈటల ఈ రోజు తన వద్దకు వచ్చారని చెప్పారు.

కార్యకర్తలు, కార్పోరేటర్ కుటుంబ సభ్యులతో ఈటల మాట్లాడి ధైర్యం చెప్పారన్నారు. కార్యకర్తలకు ఆర్థికంగా, రాజకీయంగా, న్యాయపరంగా పార్టీ అండగా ఉంటుందని ఈటల హామీ ఇచ్చారన్నారు. చాలారోజులుగా తామిద్దరం కలవాలనుకుంటున్నామని, కానీ ఇప్పుడు ఈటల స్వయంగా వచ్చారన్నారు.

తన సస్పెన్షన్ గురించి ఈ భేటీలో ఎలాంటి చర్చ జరగలేదన్నారు. కానీ అంతకుముందు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు మాత్రం కేంద్ర పెద్దలతో మాట్లాడుతున్నారని తెలిపారు. తాను బీఆర్ఎస్ లోకి వెళ్తాననే వార్తలను రాజాసింగ్ కొట్టి పారేశారు. తన జీవితంలో ఆ పార్టీలోకి వెళ్లేది లేదన్నారు. తన నియోజకవర్గం అభివృద్ధి కోసం తాను మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, హరీశ్ రావు తదితరులందరినీ కలుస్తానని చెప్పారు. కానీ పార్టీ మారేది లేదన్నారు.



## పదేండ్ల అత్యల్ప ర్యాంక్‌కు... పీవీ సింధు



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 19:** భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఏడాది నుంచి నిరాశ పరుస్తోంది. ఈ ఏడాది ఆమె ఒక్క టైటిల్ కూడా గెలవలేదు. గాయాల కారణంగా నాలుగైదు నెలలు ఆటకు దూరంగా ఉంది. దాంతో, ఫామ్ కూడా కోల్పోయింది. ప్రతి టోర్నీలో నిరాశ పరచడంతో ఆమె ర్యాంక్ కూడా దిగజారుతూ వస్తోంది. 2017లో ప్రపంచ రెండో ర్యాంక్‌కు చేరుకున్న తెలుగమ్మాయి ఇప్పుడు ఏకంగా 17వ ర్యాంక్‌కు పడిపోయింది. గత పదేళ్లలో ఆమెకు ఇదే అత్యల్ప ర్యాంక్ కావడం విశేషం. బీడబ్ల్యూఎఫ్ తాజాగా విడుదల చేసిన మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్ లో సింధు ఐదు స్థానాలు కోల్పోయి 12 నుంచి 17వ స్థానానికి దిగజారింది. చివరగా 2013 జనవరిలో సింధు 17వ ర్యాంక్‌లో నిలిచింది. మరో సీనియర్ షట్లర్ సైనా నెహ్వాల్ 31 నుంచి 36 ర్యాంక్‌కు పడిపోయింది. పురుషుల సింగిల్స్ లో హెచ్ ఎస్ ప్రణయ్ 9 నుంచి 10వ ర్యాంక్‌కు దిగజారాడు. లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్ 12, 20వ ర్యాంకుల్లో మార్పు లేదు. పురుషుల డబుల్స్ లో భారత్ నుంచి అత్యధికంగా సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి ప్రపంచ మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

## కాలువలో కొట్టుకొస్తున్న శవాలు..
# ఏపీలో కలకలం రేపుతోన్న గుర్తు తెలియని డెడ్‌బాడీలు...

**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 19:** కృష్ణా జిల్లా పరిధిలో బందరు కాలువ పొడువున ఒకేరోజు మూడు మృతదేహాలు కొట్టుకురావడం కలకలం రేపింది. నిన్న కాలువలో కారులో గల్లంతైన అవనిగడ్డకు చెందిన రత్న భాస్కర్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో బంధరు కాలువలో గంటల వ్యవధిలోనే ఒక్కొక్క మృత దేహం కొట్టుకొచ్చింది. దీనితో పోలీసులు అటు మృత దేహాలను బయటకు తీసుకొని రాలేక అలా అని వాటిని వదిలేయలేక తలలు పట్టుకుంటున్నారు.

అయితే మృత దేహాలు ఎక్కడ నుంచి వస్తున్నాయనే వాటికి పోలీసులు కూడా సమాధానం చెప్పలేక పోతున్నారు.కాలువలో కొట్టుకొస్తున్న మృత దేహాలు మొత్తం గుర్తు పట్టలేనంత మారిపోయి దుర్గంధం వెదజల్లుతు కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో పోలీసులకు ఇవి సవాల్గా మారుతున్నాయి.అయితే కాలువలో



కొట్టుకోస్తున్న మృత దేహాలు మొత్తం వ్యవహారంలో బాధితులు ఎవ్వరూ అనేది కూడా అంతుచిక్కని ప్రశ్నలుగా ఉన్నాయి.విజయవాడ నుంచి మొదలు కొన్ని కిలోమీటర్ల మేర పారుతున్న కాలువలో ఈ మృత దేహాలు ఎక్కడి నుంచి వచ్చాయి ఎవరైనా హత్య చేశారా లేక ఆత్మహత్య చేసుకున్నారా లేదా ప్రమాదవశాత్తు జరిగిన మరణాల అనేవి మిస్టరీగా మారాయి. అయితే కాలువ వెంబడి ఉండే గ్రామాల ప్రజలు మాత్రం ఇటీవల కాలంలో వరుసగా మృత దేహాలు విజయవాడ శివారు ప్రాంతాలు నుంచి అవనీగడ్డ వరకు ఎక్కడో ఒకచోట రోజూ మృత దేహాలు కనిపిస్తాయని అంటున్నారు. ముఖ్యంగా చోడవరం, పులిపాక , సమీప గ్రామాలు లంకల పరిధిలోనే ఎక్కువగా నీళ్లు దిగువకు వదిలిన ప్రతిసారి కొట్టుకొస్తున్నాయని తాము వాటిని బయాందోళనకు గురవుతున్నామని అంటున్నారు.



## చంద్రయాన్ 3 స్పేస్ క్రాఫ్ట్ సేఫ్ జర్నీ..
# చందమామకు చేరువగా మరోమారు కక్ష్య పెంపు!

**ఇయ్యాల్టి న్యూస్, శ్రీహరికోట, జూలై 19:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఈనెల 14న తిరుపతి జిల్లాలోని సతీష్ దావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి చంద్రయాన్ 3 ప్రయోగించిన సంగతి తెలిసిందే. వీరి పర్యవేక్షణలో ఈస్పేస్ క్టాఫ్ట్ సేఫ్‌గా ప్రయాణిస్తోంది. భూమి చుట్టూ విజయవంతంగా చంద్రయాన్ 3 ఉపగ్రహం ప్రదక్షిణలు చేస్తూ ఉంది. చంద్రయాన్ 3ని ఎప్పటికప్పుడు ఇస్రో శాస్త్రవేత్తలు బెంగళూరులోని ఇస్ ట్రాక్ సెంటర్ నుంచి నియంత్రణ చేస్తున్న సంగతి తెలసిందే. చంద్రయాన్ 3 ఉపగ్రహంలోని ఇంధనాన్ని మండిస్తూ రైజింగ్ ఆపరేషన్ ద్వారా ఆపోజి (భూమి నుంచి దూరాన్ని) పెంచుకుంటూ పోతూ ఉన్నారు. అందులో భాగంగానే ఇప్పటికే ఇస్రో శాస్త్రవేత్తలు రెండుసార్లు ఆర్బిట్ రైజింగ్ ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. మంగళవారం సాయంత్రం మూడవ ఆర్బిట్ రైజింగ్ ఆపరేషన్ కూడా విజయ వంతంగా పూర్తి చేశారు. బెంగళూరులోని ఇస్ ట్రాక్ సెంటర్ వద్ద మూడవ ఆర్బిట్ రైసింగ్ ఆపరేషన్ లను మంగళవారం సాయంత్రం విజయవంతంగా పూర్తి చేశారు. భూమికి అతి దూరంగా అంటే దాదాపుగా 52,000 కిలోమీటర్ల దూరం వైపు చంద్రయాన్ 3 ఉపగ్రహాన్ని పంపుతూ చంద్రునికి దగ్గరగా చేర్చడం జరుగుతూ ఉంది.

ఇలాంటి రైజింగ్ ఆపరేషన్‌లు ఇస్రో శాస్త్రవేత్తలు ఇంకా మరి కొన్ని దశల్లో చంద్రయాన్ 3 ఉపగ్రహాన్ని చంద్రునికి దగ్గరగా పంపుతారు. ఇలా ప్రొఫల్సన్ మాడ్యూల్ ద్వారా ల్యాండర్‌ను చంద్రుని కక్ష పైకి దింపడంలో ఇస్రో శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారు. కాగా చంద్రయాన్ 3 వ్యోమనౌక దాదాపు 40 రోజులపాటు అంతరిక్షంలో ప్రయాణించి చివరికి ఆగస్టు 23 లూదా 24న చంద్రుడిపై అడుగుమోపనుంది.



## చికోటి ప్రవీణ్ సెక్యూరిటీ సిబ్బంది కేసు...
# పరారీలో చికోటి


**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 19:** చికోటి ప్రవీణ్ సెక్యూరిటీ సిబ్బంది కేసు రిమాండ్ రిపోర్ట్ తయారైంది. కాగా చికోటి ప్రవీణ్ పరారీలో ఉన్నారు. చికోటి ప్రవీణ్ పై పోలీసులు నాన్ బెయిల్ కేసులు నమోదు చేశారు. A1గా చికోటి ప్రవీణ్ ను కీలక నిందితుడుగా పేర్కొన్నారు. హైదరాబాద్ పాతబస్తీలో లాల్ దర్వాజ బోనాల్లో టాస్క్ ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు. మూడు లైవ్ రౌండ్స్ రివాల్వర్స్ ను స్వాధీనం చేసుకున్నారు.చికోటి ప్రవీణ్ తో పాటు మరో ముగ్గురిపై ఛత్రినాక పోలీసులు కేసులు నమోదు చేశారు. U/s: 420,109 ఐపీసీ మరియు సెక్షన్ 25(1A),(1B) సెక్షన్ 30 of Arms యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. చీటింగ్ తో పాటు ఆర్మ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు అయ్యాయి. లైసెన్స్ లేకుండా అక్రమంగా ప్రైవేట్ సెక్యూరిటీ చికోటి ఏర్పాటు చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.

సాయుధ వ్యక్తిగత గార్డులుగా కొనసాగేందుకు నిందితులకు అధికారం లేదని చెప్పారు. A1 చికోటి ప్రవీణ్, A2 సుందర్ నాయక్, A3 రాకేష్, A4 రమేష్ గౌడ్ గా పోలీసులు పేర్కొన్నారు. వీరికి 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ కు విధించారు. A2 సుందర్ నాయక్, A3 రాకేష్, A4 రమేష్ గౌడ్ ను పోలీసులు రిమాండ్ కు తరలించారు. 11

## లవర్ కోసం రోజూ గ్రామం మొత్తం కరెంట్ తేసేస్తోంది.. సీన్ కట్ చేస్తే.....?

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 19:** అదో గ్రామం. రాత్రి సమయంలో ప్రతీరోజు కరెంట్ కట్ అవుతోంది. మొదట్లో ఎందుకో అనుకునేవారు గ్రామస్తులు అంతా. కానీ ప్రతీరోజు కరెంట్ పోతోంది. దీంతో విసుగొచ్చేసింది ఊర్లో అందరికి రోజు ఇలాగే అవుతోంది ఏంటా అని ఆరా తీశారు. ప్రతీరోజు గ్రామంలో కరెంట్ పోవటానికి కారణం ఓ యువతి అని తెలుసుకుని ఆశ్చర్యపోయారు గ్రామస్తులంతా. ఓ యువతి ప్రతీ రోజు రాత్రి అయితే చాలు ట్రాన్స్ ఫారం వద్దకు వెళ్లి కరెంట్ ఆఫ్ చేస్తోంది. మరి ఆమె ఎందుకలా చేస్తోంది తెలిసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న గ్రామస్తులు ఆమెకు తగినశాస్తి చేశారు? ఇంతకీ ఆమె ఎందుకు కరెంట్ ఆఫ్ చేస్తోంది..? గ్రామాన్ని ఎందుకు చీకటి చేస్తోందంటే.. ప్రియుడు కోసం' అని తెలిసింది. బీహార్ లోని నైథాన్ పోలీస్ స్టేషన్ పరిథిలోని బేటియా గ్రామంలో ప్రతీరోజు రాత్రి సమయంలో ఏకాంతంగా ప్రియుడ్ని కలుసుకోవటానికి రోజు కరెంట్ ఆఫ్ చేస్తోంది.

ప్రతీరోజు కరెంట్ పోవటంతో విసిగిపోయిన గ్రామస్తులంతా ఎందుకిలా జరుగుతోందో తెలుసుకోవాలను కున్నారు. కొంతమంది మగవారు అంతా కలిసి ఆ గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్ ఫారం వద్దకెళ్లారు. అక్కడ ఓ యువతి యువకుడు కూర్చుని ఏకాంతంలో మునిగిపోయి ఉన్నారు. అది చూసి గ్రామస్తులు షాక్ అయ్యారు. వారిద్దరిని నిలదీశారు. దీంతో అసలు విషయం చెప్పారు. అదే గ్రామానికి చెందిన సదరు యువతిని ఓ యువకుడు ప్రేమిస్తున్నాడు.ఆమెను కలుసుకోవటానికి రోజు రాత్రి సమయంలో ఆ గ్రామం వస్తున్నాడు. దీంతో అతడిని కలుసుకునేందుకు ఆమె కరెంట్ కట్ చేస్తోంది.అదే



విషయం చెప్పేసరికి తెల్లబోయిన గ్రామస్తులు సదరు యువకుడిని కొట్టారు. దీంతో ఆమె అడ్డం వెళ్లి వారిని వారించింది. తాను అతనిని ప్రేమిస్తున్నానని చెప్పింది.

దీంతో ఈ విషయాన్ని వారి పెద్దలవద్దకు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. వారిద్దరికి పెళ్లి చేయటానికి పెద్దలను ఒప్పించారు. అలా వారిద్దరికి 'పెళ్లి'కుదర్చారు. ఇక ఆగ్రామంలో ప్రతీరోజు కరెంట్ కట్ అవ్వటంలేదు.




## 'ఇండియా' కూటమికి ట్యాగ్‌లైన్‌గా...
# 'జీతేగా భారత్?'

**ఇయ్యాల్టి న్యూస్, బెంగుళూరు, జూలై 19:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు ఒక్కటవుతున్నాయి. బెంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో పాల్గొన్న 26 పార్టీలు ఒక కూటమిగా ఏర్పడ్డాయి. తమ ఫ్రంట్ కు 'ఇండియా' అనే పేరును ప్రకటించాయి. ఇండియా అంటే ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్. తాజాగా ఈ కూటమికి ట్యాగ్‌లైన్ గా 'జీతేగా భారత్'ను ఎంచుకున్నాయి. గత రాత్రి జరిగిన చర్చల తర్వాత జీతేగా భారత్ (భారత్ గెలుస్తుంది)పై తుది నిర్ణయం తీసుకున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు తమ కూటమికి ఇండియా అని పేరు పెట్టినప్పుడు కూటమి పేరులో భారత్ అనే పదం ఉండాలని భావించారు. కానీ, అది సాధ్యం కాకపోవడంతో ఇది ట్యాగ్‌లైన్‌లో కనిపించాలని నిర్ణయించుకున్నారు.



## జపాన్ సముద్రంలోకి బాలిస్టిక్ క్షిపణులు..
# ప్రయోగించిన నార్త్ కొరియా

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 19:** రియన్ ద్వీపకల్పంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. పొరుగు దేశం నుంచి ముప్పు పొంచి ఉందన్న ఆందోళనతో అగ్రరాజ్యం అమెరికాతో జట్టుకట్టున దక్షిణ కొరియా.. క్రమంతప్పకుండా సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నది. వాషింగ్టన్, సియోల్ మధ్య రక్షణ సహకారం రోజురోజుకు పెరిగిపోతున్నది. దీంతో కిమ్ కింగ్డమ్ ఉత్తర కొరియా వరుసగా క్షిపణులను ప్రయోగిస్తున్నది. తాజాగా ఇయ్యాల బుధవారం తెల్లవారుజామున రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. జపాన్ సముద్రంలోకి ఈ క్షిపణులను ప్రయోగించినట్లు దక్షిణ కొరియా సైన్యం వెల్లడించింది.అమెరికా అణు జలాంతర్గామి దక్షిణ కొరియాకు వెళ్లిన నేపథ్యంలో ప్యాంగాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని ఓ ప్రదేశం నుంచి రెండు స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఈ ప్రయోగం జరిగినట్లు యోన్‌హాప్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. దీనిని జపాన్ కోస్టుగార్డు కూడా ధృవీకరించినట్లు తెలిపింది. ఇవి ఎలాంటి క్షిపణులు అనే విషయాన్ని దక్షిణ కొరియా సైన్యం పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.దక్షిణ కొరియాలోని ఓడరేవుకు అణు బాలిస్టిక్ క్షిపణులను పేల్చగల సామర్థ్యం ఉన్న జలాంతర్గామిని అమెరికా తీసుకొచ్చింది. అది వచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ ప్రయోగాలు జరగడం గమనార్హం. అణు బాలిస్టిక్ క్షిపణులను అమెరికా దక్షిణ కొరియాతు తీసుకురావడం గత నాలుగు దశాబ్దాల్లో ఇదే మొదటిసారి.

## 'అమెరికాలో ఎక్స్‌పర్ట్స్ లేరు..
# హెచ్1బీ కోటా పెంచండి'..


**- బైడెన్‌కు ఐటీ కంపెనీల రిక్వెస్ట్**




**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 19:** అమెరికాలో ఐటీ నిపుణుల కొరత తీవ్రంగా ఉందా? నిపుణుల కొరతతో కంపెనీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయా? అవుననే సమాధానమే వస్తోంది. ఈ నేపథ్యంలో నిపుణుల నియామకానికి సంబంధించిన వీసాల సంఖ్య పెంచాలని బైడెన్ ప్రభుత్వానికి ఐటీ సేవల సంఘం విజ్ఞప్తి చేసింది.

## రేపటి నుంచి పార్లమెంట్
# వర్షాకాల సమావేశాలు

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , జూలై 19:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల రేపు (గురువారం) ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలకు సంబంధించి పలు అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇయ్యాల అఖిలపక్ష సమావేశాన్ని



ఏర్పాటు చేసింది. ఉభయ సభల సమావేశాలకు ముందు అఖిల పక్షం సమావేశం కావడం ఆనవాయితీగా వస్తోంది. ప్రధానమంత్రి, కేంద్ర సీనియర్ మంత్రులు, వివిధ పార్టీల పార్లమెంటరీ పక్ష నేతలు ఈ సమావేశానికి హాజరవుతుంటారు.ఇక రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మంగళవారమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కానీ, చాలా పార్టీల నాయకులు అందుబాటులో లేకపోవడంతో అది ఈ రోజుకు వాయిదా పడింది. అఖిల పక్ష భేటీ గురించి చర్చించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన కేబినెట్ సహచరులు ప్రహ్లాద్ జోషి, పీయూష్ గోయల్‌తో నిన్న సమావేశమయ్యారు. కాగా, ఈ ఏడాది చివర్లో తెలంగాణ సహా పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో బీజేపీ, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం దాడులకు దిగడంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రసవత్తరంగా మారనున్నాయి.

కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ధరల పెరుగుదల, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వంటి సమస్యలతో పాటు మణిపూర్ సంక్షోభంపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూస్తున్నాయి. గత సెషన్ కూడా తరచూ విపక్షాల నిరసనలతో హోరెత్తింది.

## ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్ కలిగిన దేశంగా సింగపూర్..

**- భారత్ స్థానం ఎంతంటే..?**

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 19:** ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్ పోర్ట్ కలిగిన దేశంగా సింగపూర్ నిలిచింది. గత ఐదేళ్లుగా అగ్రస్థానంలో ఉన్న జపాన్ ను తాజాగా సింగపూర్ వెనక్కి నెట్టి అత్యంత శక్తివంతమైన పాస్ పోర్ట్ కలిగిన దేశంగా అవతరించింది.




సింగపూర్ పాస్ పోర్ట్ ఉన్న వారు వీసా రహితంగా, వీసా ఆన్ అరైవల్ విధానంలో ప్రపంచవ్యాప్తంగా 192 దేశాల్లో పర్యటించవచ్చు. అన్ని దేశాల పాస్ పోర్ట్ ల ర్యాంకింగ్స్ కు సంబంధించిన నివేదికను లండన్ కు చెందిన ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ 'హెన్లీ పాస్ పోర్ట్ ఇండెక్స్' తాజాగా విడుదల చేసింది.ఆ నివేదిక ప్రకారం.. గత ఐదేళు ్లగా అగ్రస్థానంలో ఉన్న జపాన్ ప్రస్తుతం మూడో స్థానానికి పడిపోయింది. ఈ పాస్ పోర్ట్ ద్వారా గతంలో 193 దేశాల్లో పర్యటించే అవకాశం ఉండేది. కానీ, ప్రస్తుతం 189 దేశాల్లో మాత్రమే పర్యటించొచ్చు. ఇక భారత్ విషయానికి వస్తే.. గత ఏడాదితో పోలిస్తే 5 స్థానాలను మెరుగుపరుచుకుంది. గతంలో 85వ స్థానంలో నిలిచిన భారత్.. ప్రస్తుతం 57 దేశాలకు వీసా రహిత ప్రవేశంతో టోగో, సెనెగల్ తో పాటు సూచీలో 80వ స్థానానికి చేరుకుంది. ఈ దేశాల పాస్ పోర్ట్ తో 57 దేశాల్లో పర్యటించొచ్చు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/


## జాన్వీ టు జాక్వెలిన్.. ఏం లుక్స్‌రా నాయినా..
# ఒక్కరూ తగ్గట్లేదుగా!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19:** తమ డ్రెస్సింగ్ స్టైల్‌తో అబ్బురపరిచే సినీ తారలు నెట్టింట సందడి చేసేందుకు మన ముందుకు వచ్చేశారు. బాలీవుడ్ బ్యూటీస్ జాన్వీ కపూర్, జాక్వెలీన్ ఫెర్నాండెజ్, రాధిక మదన్ తమ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో లేటెస్ట్ ఫొటోస్ అప్?లోడ్ చేసి పోరగాళ్లను హీటెక్కించారు. ఆ ఫోటోలను మీరు కూడా ఓ లుక్కేయండి.







## క్యూట్ లుక్స్‌తో అట్రాక్ట్... యూత్‌న్ టీజ్ చేస్తూ జాన్వీ కపూర్..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19:** జాన్వీ కపూర్ శ్రీదేవి కుమార్తె అని అందరికి విదితమే.. ఈ ముద్దగుమ్మ ధడక్ సినిమా ద్వారా బాలీవుడ్ చిత్ర సీమకు పరిచయమైంది. తర్వాత అనేక హిందీ సినిమాల్లో నటించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.. తాజాగా ఈ చిన్నది దేవర సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టబోతుంది.

## చూసి ముర్వాలె.....



## ఒంపుల హంపికలా... 'అతుల్య రవి' వండర్స్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19: తమిళ్ ఇండస్ట్రీ నుండి తెలుగులో అడుగు పెట్టి చేసిన కొద్ది సినిమాల్లోనే ఎక్కువ క్రేజ్ సంపాదించుకున్న సొగసుల వయ్యారి అతుల్య రవి.. ఇప్పుడు స్టార్ డమ్ కోసం వేచి ఉంది అతుల్య..
ఇక సోషల్ మీడియా ఫాలోయింగ్ అయితే బానే ఉంది ఈ అమ్మడికి. లేటెస్ట్‌గా పోస్ట్ చేసిన ఫోటోలు చూసి పోరగాళ్లు తెగ ఖుషి అవుతున్నరు.



## సమంతకు పన్నెండు కోట్ల నష్టం?.. ఇలా ఎంతకాలమో మరి..?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19: సమంతకు మయోసైటిస్ రావడం వల్ల తన సినిమాలన్నీ ఆలస్యం అవుతూ వచ్చాయి. యశోద సినిమా ప్రమోషన్స్‌లో ఎక్కువగా పార్టిసిపేట్ చేయలేకపోయింది. శాకుంతలం సినిమాకు అతి కష్టం మీద బయటకు వచ్చింది. ప్రమోషన్లు చేసింది. అయితే మళ్లీ కాస్త రెస్ట్ తీసుకుంది. తాను ముందు కమిట్ అయిన ఖుషి, సిటాడెల్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కంకణం కట్టేసుకుంది. కష్టపడి ఆ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసింది.సమంతకు ఒక వేళ మయోసైటిస్ రాకపోయి ఉంటే.. పరిస్థితి ఇలా లేకపోయి ఉంటే.. బాలీవుడ్‌లో వరుసగా ప్రాజెక్టులు చేసేది. పుష్పతో వచ్చిన క్రేజ్‌ను క్యాచ్ చేసుకునేది. కానీ సమంతకు బ్యాడ్ లక్. మయోసైటిస్‌తో లేవలేని స్థితిలోకి సమంత వెళ్లింది. ఆరేడు నెలలు విరామం తీసుకుంది. మెల్లిగా తన సినిమా రిలీజ్ టైంకు బయటకు వచ్చింది. కష్టం మీద ప్రమోషన్లు చేసింది. కాస్త కోలుకున్న సమంత.. తన మొక్కులు కూడా తీర్చుకుంది.



## మెగా ప్రిన్సెస్ క్లింకారాకు
# తారక్ స్పెషల్ గిఫ్ట్..?

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19:** టాలీవుడ్ స్టార్ నటుల్లో బెస్ట్ ఫ్రెండ్స్ అనగానే ముందుగా గుర్తొచ్చే పేర్లు రామ్ చరణ్ – ఎన్టీఆర్ . వీరిద్దరి మధ్య మంచి సోదర బంధం ఉంది. ఇదే విషయాన్ని ఇద్దరూ అనేక సందర్భాల్లో చెప్పుకొచ్చారు కూడా. ఇక తాజాగా 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో వారి మధ్య ఉన్న బంధం మరింత బలపడింది. ప్రస్తుతం ఈ ఇద్దరు నటులు గ్లోబల్ లెవల్ లో స్టార్ డమ్ సంపాదించుకున్నారు. కాగా, రామ్ చరణ్ పెళ్లైన చాలా ఏళ్ల తర్వాత తండ్రైన విషయం తెలిసిందే. చరణ్ భార్య ఉపాసన గత నెలలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో చరణ్–ఉప్సీ దంపతుల గారాల పట్టికి ఎన్టీఆర్ ఓ సర్ ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది.మెగా లిటిల్ ప్రిన్సెస్ క్లింకారా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా డిజైన్ చేయించిన గోల్డ్ డాలర్స్ ను బహుమతిగా పంపించినట్లు మెగా, నందమూరి కాంపౌండ్ నుంచి టాక్ వినిపిస్తోంది. అది కూడా తారక్ పిల్లలు అభయ్, భార్గవ్ రామ్ లు ఎంతో ఇష్టంగా వాటిని అందించినట్లు తెలుస్తోంది. ఆ డాలర్స్ మీద చరణ్, ఉపాసన, క్లింకారాల పేర్లు వచ్చేలా డిజైన్ చేయించినట్లు సమాచారం. ఈ బహుతులు మెగా ఫ్యామిలీకి చాలా బాగా నచ్చినట్లు తెలుస్తోంది.

## పరువునష్టం కేసులో జీవిత, రాజశేఖర్ దంపతులకు జైలుశిక్ష..



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19:** పరువునష్టం కేసులో ప్రముఖ సినీ నటులు జీవిత, రాజశేఖర్ దంపతులకు నాంపల్లి కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ ద్వారా సేకరించిన రక్తాన్ని మార్కెట్లో అమ్ముకుంటున్నారని 2011లో జీవిత, రాజశేఖర్ ఆరోపించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన సినీ నిర్మాత అల్లు అరవింద్ కోర్టును ఆశ్రయించారు. చిరంజీవి పేరుతో నడుస్తున్న సేవా కార్యక్రమాలపైన, ట్రస్టు పైనా అసత్య ఆరోపణలు చేశారంటూ పరువునష్టం దావా వేశారు. వారు చేసిన ఆరోపణలకు సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలను కోర్టుకు సమర్పించారు. సుదీర్ఘ విచారణ అనంతరం నిన్న కోర్టు తీర్పు వెల్లడించింది. ఇద్దరికీ ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 5 వేల జరిమానా విధించింది. అయితే, జరిమానా చెల్లించడంతో పైకోర్టులో అప్పీలుకు అవకాశమిస్తూ బెయిలు మంజూరు చేసింది.

## ఆ ప్లేస్‌లో టాటూ వేయించుకున్న '96' జాను.. వైరల్ అవుతున్న ఫొటో..


**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19:** తమిళ్ లో విజయ్ సేతుపతి , త్రిష జంటగా వచ్చిన 96 సినిమా మంచి విజయం సాధించి క్లాసిక్ హిట్‌గా నిలిచింది. అదే సినిమాని శర్వానంద్, సమంతలతో జాను అని తీయగా ఇక్కడ కూడా పర్వాలేదనిపించింది. ఈ రెండు సినిమాలలో హీరోయిన్ చిన్నప్పటి క్యారెక్టర్స్ చేసింది గౌరి కిషన్. చిన్నప్పటి జాను క్యారెక్టర్‌లో గౌరి ప్రేక్షకులని మెప్పించింది. ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టిన గౌరి ఇప్పుడు హీరోయిన్‌గా సినిమాలు చేస్తుంది.గౌరి కిషన్ ఆల్రెడీ తెలుగులో సంతోష్ శోభన్ సరసన శ్రీదేవి శోభన్ బాబు అనే సినిమాతో హీరోయిన్‌గా కూడా చేసింది. ప్రస్తుతం పలు తమిళ్, మలయాళం సినిమాలు చేస్తుంది. తాజాగా గౌరి వార్తల్లో నిలిచింది. ఇటీవల తాను టాటూ వేయించుకుంటున్నాను అని ప్రకటించింది. తాజాగా తన టాటూని ఫొటో తీసి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేసింది. గౌరీ తన టాటూని రైట్ సైడ్ నడుము పై భాగంలో చేయి కింద నుంచి ప్రైవేట్ పార్ట్స్ వరకు ఉండేలా వేయించుకుంది. దీనిని రిబ్ టాటూ అంటారు. ఇక ఈ టాటూని ఫొటో తీసి పెట్టగా ఇది వైరల్ గా మారింది. తన టాటూ పూర్తిగా కనిపించేలా పోస్ట్ చేయడంతో ఈ ఫొటో వైరల్ గా మారింది. పలువురు టాటూని ఆ ప్లేస్ లో వేసుకున్నందుకు విమర్శిస్తుండగా మరికొందరు మాత్రం సూపర్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు.






## పాస్‌పోర్టు ఆఫీసర్‌గా మెగాస్టార్!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19: చిరంజీవి తన తదుపరి ప్రాజెక్టుల కోసం వరుసగా యంగ్ డైరెక్టర్లను లైన్లో పెడుతున్నారు. అనిల్ రావిపూడి.. కల్యాణ్ కృష్ణ... శ్రీవశిష్ఠలతో సినిమా చేయడానికి ఆయన రెడీ అవుతున్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. అనిల్ రావి పూడితో యాక్షన్ కామెడీ.. శ్రీవశిష్ఠతో ఫాంటసీ జోనర్లో చేయనున్నట్టుగా చెబుతున్నారు. ఇక కల్యాణ్ కృష్ణతో చేయనున్న సినిమాకి వచ్చేసరికి మరో ఆసక్తికరమైన విషయం వినిపిస్తోంది. ఈ సినిమాలో చిరంజీవి 'పాస్ పోర్టు ఆఫీసర్'గా కనిపించనున్నారని అంటున్నారు. ఈ పాత్రలో ఆయన లుక్ చాలా స్టైలీష్‌గా ఉండనుందని చెబుతున్నారు. ఈ తరహా పాత్రను చిరంజీవి పోషించడం ఇదే మొదటిసారి. చిరంజీవి పెద్ద కూతురు సుస్మిత తన సొంత బ్యానర్ పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇది మలయాళంలో మోహన్ లాల్ చేసిన ఒక సినిమాకి రీమేక్ అనే టాక్ వచ్చింది. అయితే అందులో ఎంతమాత్రం నిజం లేదని చెబుతున్నారు. త్రిష కథానాయికగా నటించనున్న ఈ సినిమాలో, శ్రీలీల ముఖ్యమైన పాత్రలో కనిపించనుంది.



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19: జబర్దస్త్ షో తో పాపులర్ అయిన కమెడియన్స్ అందరు అనేక సోషల్ మీడియాల్లో రచ్చ చేస్తున్నారు.. అదే బాటలో నడుస్తుంది వర్ష.. తన లేలేత అందాలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ పోరగాళ్లకు గాలం వేస్తుంది ఈ ముద్దుగుమ్మ

## స్లీవ్‌లెస్ డ్రెస్‌లో స్లిమ్‌గా... జబర్దస్త్ వర్ష క్యూట్ స్టిల్స్ నెట్టింట వైరల్

## రెబల్ స్టార్ 'ప్రాజెక్ట్ కె' ఫస్ట్ లుక్..

### మిల్లీ సెకన్లతో సహా ప్రకటించిన టీమ్!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 19:** వైజయంతీ మూవీస్ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ కె'. డార్లింగ్ స్టార్ ప్రభాస్, దీపికా పదుకొనె జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో లెజెండరీ యాక్టర్స్ అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. స్టార్ కాస్టింగ్, భారీ బడ్జెట్ సహా సర్‌ప్రైజింగ్ యూనివర్సల్ స్టోరీ లైన్‌తో తెరకెక్కిన ఈ పాన్ వరల్డ్ మూవీపై విపరీతమైన అంచనాలు ఉన్నాయి. శాన్ డియోగా కామిక్ కాన్ వేడుకల్లో భాగంగా యూఎస్ఏలో జులై 20న (ఇండియా టైమ్ జులై 21) 'ప్రాజెక్ట్ కె' ఫస్ట్ గ్లింప్స్, టైటిల్ అనౌన్స్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలోనే రీసెంట్‌గా దీపికా పదుకొనె ఫస్ట్ లుక్ రివీల్ చేసిన మేకర్స్.. ఇప్పుడు రెబల్ స్టార్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసే టైమ్‌ను మిల్లీ సెకన్లతో సహా ప్రకటించారు. ఇందుకోసం 0 నుంచి 7 వరకు వరుస అంకెలను ఎంచుకున్న మేకర్స్.. 01.23.45.67 %ఖీ (×ూ%) టైమ్‌ను రివీల్ చేశారు. ఈ నంబర్ ఫ్రేమింగ్ ఆసక్తి కలిగిస్తుండగా.. మొత్తానికి ఈరోజు (బుధవారం) సరిగ్గా 1 గంటా 23 నిమిషాల 45 సెకన్ల 67 మిల్లీ సెకన్లకు ప్రభాస్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేయనున్నారు. దీంతో డార్లింగ్ స్టార్ అభిమానుల ఆనందానికి అవధుల్లేవు. అయితే ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు నార్మల్ ఆడియన్స్ కూడా ఈ మూవీ అప్‌డేట్ కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఎందుకంటే డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఇప్పటి వరకు సిల్వర్ స్క్రీన్‌పై ఆవిష్కరించని ఇంట్రెస్టింగ్ పాయింట్‌తో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు.





Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838